ప్రజాశక్తి
ఆదివారం 24 డిసెంబరు 2023 5 శ్రీకాకుళం

26న అరసవల్లి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని ఈ నెల 26న లెక్కిస్తున్నట్లు ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం మంగళవారం ఉదయం 8 గంటలకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, యాత్రికులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో లెక్కింపు చేపడతామని తెలిపారు.

అదే పోరు

- 12వ రోజుకు అంగన్వాడీల నిరవధిక సమ్మె
- ఇచ్ఛాపురంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్ వాహనం అడ్డగింత

ఇచ్ఛాపురం : ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన శనివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలకు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయమంటే నిర్బంధం ప్రయోగించి సమ్మె విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. ఈ చర్యలు అప్రజాస్వామికమని ఖండించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. నాలుగున్నరేళ్లుగా అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. మినీ వర్కర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. విశ్రాంత బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి, కృష్ణభారతి, ఇ.అప్పలనర్సమ్మ పాల్గొన్నారు. ఇచ్ఛాపురం బస్టాండ్ చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు రైతు కూలి సంఘం నాయకులు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని రైతు కూలి సంఘం నాయకులు జన్నేల ప్రసాదరావు, ఆసి చిరంజీవులురెడ్డి, కూర్మారావురెడ్డిలు అన్నారు. దీక్షలో సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు. పలాస-కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెను యూనియన్ సీనియర్ నాయకులు కె.జ్యోతి ప్రారంభించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రణస్థలం : ఆర్థికసాయం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.సుజాత డిమాండ్ చేశారు. రణస్థలం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు యుటిఎఫ్ నాయకులు సమ్మెకు సంఘీభావం తెలుపుతూ అంగన్వాడీల పోరాటానికి విరాళంగా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. పాతపట్నంలో చేపట్టిన అంగన్వాడీ నిరవధిక సమ్మెకు టిడిపి నాయకులు, సామాజిక కార్యకర్త మామిడి గోవిందరావు సంఘీభావం తెలుపుతూ అంగన్వాడీల పోరాటానికి విరాళంగా రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మె 12వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు చెవుల్లో పువ్వులు పెట్టుకుని తమ నిరసనను తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.జ్యోతిలక్ష్మి, ఎస్.రమణమ్మ, జి.నాగరత్నం, కె.కృష్ణవేణి పాల్గొన్నారు. ఆమదాలవలస ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆట, పాటలతో అంగన్వాడీలను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు పి.భూలక్ష్మి, పి.లక్ష్మి, కనకం పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో చేపట్టిన సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. నరసన్నపేటలో చేపట్టిన నిరవధిక సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, ఆర్.సురేష్‌బాబు, వై.చలపతి రావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.సరోజిని, పి.భాగ్యలక్ష్మి, అమర, హేమ, కె.అమ్మడమ్మ పాల్గొన్నారు. ఇచ్ఛాపురం రెవెన్యూ కార్యాలయంలో ఒరిస్సా సమస్యలపై మాట్లాడేందుకు శనివారం సాయంత్రం ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇచ్ఛాపురం వచ్చారు. విషయం తెలుసుకున్న అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక బస్టాండ్ కూడలి వద్ద జెసి వాహనాన్ని అడ్డుకున్నారు. దీనిపై జెసి స్పందిస్తూ... రెవెన్యూ కార్యాలయానికి మాట్లాడేందుకు రావాలని సూచించారు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తర్వాత వచ్చిన నవీన్ కార్యకర్తలతో నేరుగా మాట్లాడారు. అంగన్వాడీలు తమ ఆందోళనకు గల కారణాలు వివరించారు. తాళాలు పగులగొట్టి కేంద్రాలు స్వాధీనం చేసుకోవడం, సమ్మెపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నవీన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జెసి స్పందిస్తూ... అంగన్వాడీ కేంద్రాలు మూస్తే చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ ఎలా జరుగుతుందని తిరిగి ప్రశ్నించారు. అందుకే కేంద్రాలు తెరిపించి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సమ్మెపై ప్రభుత్వం పరిశీలనలో ఉందని, మీ ఉద్యోగాలు తొలగింపు జరగదని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. అనంతరం డిమాండ్ పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ నవీన్‌కి అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ భరత్ నాయక్, తహశీల్దార్ మీనాదేవి, డిటిలు గురుప్రసాద్, శ్రీహరి, అంగన్వాడీ యూనియన్ నాయకులు హైమా, విజయలక్ష్మి, బాలామణి పాల్గొన్నారు.

పలాస : దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

ఆమదాలవలస : నృత్యం చేస్తున్న జనార్ధనరావు

పొందూరు : చెవుల్లో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న కళ్యాణి

నరసన్నపేట : దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

కేసుల పరిష్కారం వేగవంతం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇతర రాష్ట్రాల్లో ఖైదీలను కూడా పోలీసు, ఎక్సైజ్ యంత్రాంగం తక్షణమే ముద్దాయిలను కోర్టు ముందు హాజరు పరిచి కేసు పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్లో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. పోలీసు, ఎక్సైజ్ శాఖల పరిధిలో వివిధ కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ముద్దాయిలుగా, వారిని అరెస్టు చేసిన తర్వాత సుదీర్ఘకాలం పాటు జైళ్లలో ఉంటున్నారని అన్నారు. ఈ కేసులను సత్వరమే పరిష్కరించడానికి వీలుగా ఛార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు.

సమావేశంలో జిల్లాలోని అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్య దర్శి ఆర్.సన్యాసినాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిప్పేస్వామి, జిల్లా జైలు సూపరింటెండెంట్ నబీఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల చేతికి పార్టీ జెండాలా?

ఎస్ఎఫ్ఐ నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని టెక్కలి డివిజన్ కేంద్రంలో అధికార పార్టీకి చెందిన జెండాలను టెక్కలి గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థుల చేతికిచ్చి ఆడుదాం ఆంధ్రా ర్యాలీ నిర్వహించడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్‌లు వ్యాఖ్యానించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. వైసిపి నాయకులు, వాలంటీర్లు కళాశాల లోపకు వెళ్లి విద్యార్థులను ర్యాలీ కోసం తీసుకురావడం సరికాదన్నారు. విద్యార్థులకు రాజకీయ విద్య అందించాలే తప్ప... చేతికి పార్టీ జెండాలు ఇచ్చి ర్యాలీ తీయించడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. గతంలో ఎస్ఎఫ్ఐ మణిపూర్ సంఘటనపై నిరసిస్తూ విద్యార్థులను ర్యాలీ తీసుకువస్తే... టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి ఎస్ఎఫ్ఐ నాయకులను కొట్టిన తీరును గుర్తు చేశారు. అలాగే విద్యార్థి సంఘాల పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలను అంగీకరించబోమని చెప్పిన కళాశాల ఉన్నతాధికారులు... ఇప్పుడు అధికార రాజకీయ పార్టీ కార్యక్రమానికి విద్యార్థులను ఎలా పంపించారని ప్రశ్నించారు. విద్యార్థులకు సరైన విద్య అందించాలే తప్ప... రాజకీయ పార్టీ కార్యక్ర మాలకు పంపించడం సరికాదన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కంటే ముందుగా జగన్ మామయ్య రాష్ట్రంలో ఉండే నిరుద్యోగులతో ఎప్పుడో ఆడుకున్నారని విమర్శించారు. దాదాపుగా 2 లక్షల 50 వేల నిరుద్యోగ పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేసి జిఒ నంబరు 177 ద్వారా దాదాపుగా రాష్ట్రంలో 3450 ప్రాథమిక పాఠశాల మూసివేశారన్నారు. జిఒ నంబరు 108ను తీసుకొచ్చి విద్యార్థులతో ఆటలాడుకున్నారని అన్నారు. రాష్ట్రంలో జూనియర్ కళాశాల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకుండా ఇంటర్ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ నాలుగేళ్లు చేసి ఎంట్రెన్స్ పేరిట ప్రభుత్వం కార్యాలయాల్లో పనిచేపిస్తూ విద్యార్థులతో ఆడుకుంటున్నారని అన్నారు. క్రీడలపై ఉంటే నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియంను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికులు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు నిరసిస్తూ ఈ నెల 26 నుంచి ప్రధాన డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మె చేస్తున్నట్టు సిఐటియు అనుభందంగా ఉన్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గణేష్, ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాంలు వెల్లడించారు. నగరంలోని జిటి, ఏడు రోడ్ల కూడలి, నగర పాలక సంస్థ కార్యాలయం వరకు శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్యాప్స్ డ్రైవర్ల రూ.18,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు సామాజిక భద్రత కల్పిస్తూ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండకుండానే కార్మికులను తొలగిస్తున్నారని, దీనివల్ల ఆ కుటుంబం రోడ్డున పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీర్ కార్మికులకు హెల్త్ హెలవెన్స్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కళ్యాణ్‌రాజు అరుగుల రాము, జె.రమేష్, ఆకుల శంశంకరరావు, అరుగుల గురుస్వామి, నల్లపిల్లి పార్వతి, ఈశ్వరమ్మ, జై.మాధవి, ఆర్.జి.రాజేశ్వరి, కె.రాజేష్, లక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఇచ్ఛాపురంలో బైక్ ర్యాలీ

ఇచ్ఛాపురం : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 26 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని సిఐటియు మండల నాయకులు రమేష్ కుమార్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక మస్టర్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ పుర వీధుల్లో బైక్ ర్యాలీ కొనసాగించారు.

26న పిజిలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో కేంపస్‌తో పాటు అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సు (ఎంఎ, ఎంఎస్‌సి)ల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య సిహెచ్.ఎ.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీలో స్పాట్ అడ్మిషన్లు కోసం నేరుగా ఆయా విభాగాలకు సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.500లు, ధ్రువీకరణ పత్రాలు పరిశీలన సమయంలో సమర్పించాలని తెలియజేశారు. 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. సీట్లు పొందిన వారి జాబితాను అదే రోజు రెండు గంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు అదే రోజు సాయంత్రం నాలుగు గంటల్లోగా అవసరమైన (కోర్సుకు సంబంధించి) ఫీజును చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. కాగా, ఎపిపిజి సెట్-2023 అర్హత పొందినవారు మాత్రమే ఈ స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యేందుకు అర్హులని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే విద్యాదీవెన, వసతి దీవెన వంటివి వర్తించవని చెప్పారు. ప్రవేశాలకు సంబంధించి మరిన్ని వివరాలకు 9652457373, 7893641736 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాల్సినవారు తమ డిగ్రీ ఓడి (ప్రావిజినల్), మార్కుల జాబితా, టిసి, ఎపిపిజి సెట్-2023 ర్యాంకు కార్డు, స్టడీ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. ప్రత్యేకంగా అవసరమైన వారు తమ కుల, ఇడబ్ల్యుఎస్, నివాస ధ్రువీకరణ పత్రాలూ తీసుకురావాలని సూచించారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన బూ హక్కు చట్టం-23 తక్షణమే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ జిల్లా కోర్టు ఎదుట రిలే నిరాహార దీక్షలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఈ చట్టం గుదిబండగా మారిందని, న్యాయవాద వృత్తి ఉనికికే ప్రమాదకరంగా ఉందని, ఇటువంటి చట్టం అమలులో పునరాలోచన చేయాలని కోరారు. ఈ చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఇద్ది పాపారావు, టి.మధుసూదనరావు, వి.కృష్ణారావు, ఎపిబిసి అడ్వకేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, న్యాయవాదులు వాన కృష్ణచంద్, కూన అన్నంనాయుడు, ఎన్ని రమేష్, టి.రాజారావు, మామిడి క్రాంతి, ఎస్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

అహంకారం... అణచివేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అంగన్వాడీ కార్యకర్తలు పట్టువదలకుండా తమ సమ్మె కొనసాగిస్తున్నారు. సమ్మె ప్రారంభించి 12 రోజులు గడుస్తున్నా తగ్గేదేలే అంటూ ధర్నాలు, రాస్తారోకోలు, జలదీక్షలు, వంటి రూపాల్లో తమ నిరసన తెలుపుతున్నారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంపు, సుప్రీం కోర్టు ప్రకారం గ్రాట్యూటీ అమలు, కనీస వేతనం రూ.26 వేలు తదితర డిమాండ్లపై అంగన్వాడీలు ఇప్పటికే పలు పద్ధతుల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చలో కమిషనరేట్, చలో కలెక్టరేట్, చలో ఆర్‌డిఒ కార్యాలయం వంటి కార్యక్రమాలతో ఆందోళనలు కొనసాగిస్తున్నా దున్నపోతు మీద వాన కురిసినటు ప్రభుత్వం కనీసం చలించలేదు. వాటి పర్యావసానమే నేటి అంగన్వాడీల సమ్మె. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు పెంచుతాం, అంగన్వాడీలను ఆదుకుంటామంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా వారికి వాగ్ధానం చేశారు. నాలుగున్నరేళ్లు గడచినా నేటికీ ఆ హామిని అమలు చేసేందుకు ప్రభుత్వానికి మనస్కరించడం లేదు. తెలంగాణలో అంగన్వాడీ కార్యకర్తకు రూ.13,500, హెల్పర్‌కు రూ.7,800 వేలు ఇస్తుంటే... ఇక్కడ మాత్రం కార్యకర్తకు రూ.11,500, హెల్పర్‌కు రూ.7 వేలే ఇస్తున్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోగా సమ్మెచేస్తున్న వారిపై ప్రభుత్వం అణచివేత చర్యలకు దిగుతోంది. సమ్మెను నిర్వీర్యం చేసేందుకు అన్నిరకాల పద్ధతులను అనుసరిస్తోంది. అంగన్వాడీలు లేకుండానే కేంద్రాలను తెరిపించి సమ్మె ప్రభావం ఏమీ లేదని చెప్పేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి అన్ని కేంద్రాలు తెరిచేలా చూడాలంటూ ఆదేశించింది. సచివాలయ మహిళా పోలీసులు, వాలంటీర్లు, సిఎఫ్‌లకు బాధ్యతలను అప్పగిస్తోంది. అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగలగొట్టించి పని కానిస్తోంది. కొన్నిచోట్ల సర్పంచ్‌లకు బాధ్యతలను అప్పగించింది. అవకాశం ఎప్పుడు దొరుకుతుండా అని ఎదురుచూస్తున్న వైసిపి సానుభూతి సర్పంచ్‌లు వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. సెంటర్‌కు రాకపోతే ఉద్యోగాలు పోతాయంటూ హెచ్చరిస్తున్నారు. ఇలా రకరకాల పద్ధతుల్లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారి సమ్మెపై ఉక్కుపాదం మోపుతోంది.

అంగన్వాడీలకు తాము దయతలచి జీతాలు పెంచాలే తప్ప తమను ఎదిరించడమేమిటన్న వైఖరి ప్రభుత్వంలో కనపడుతోంది. బతకలేక వేతనాలు పెంచాలని అడుగుతుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ వేతనాలు పెంచలేమని చెప్తున్న ప్రభుత్వం అదే సమయంలో వాలంటీర్లకు వచ్చేనెల నుంచి రూ.750 వేతనం పెంచడం అంగన్వాడీలపై కక్షపూరిత ధోరణికి అద్దం పడుతోంది. సమ్మెకు దిగినందుకు మీకేమి ఇవ్వం, నోరు విప్పకుండా మౌనంగా ఉంటే కాస్తాయినా దయ తలుస్తామంటూ ఉత్తర్వులు ద్వారా సంకేతాలు ఇచ్చింది. ప్రతి కుటుంబానికీ వివిధ సంక్షేమ పథకాల కింద నేరుగా రూ.1.40 లక్షలను లబ్ధిదారుల ఖాతాలకే ఇచ్చామని చెప్తున్న ప్రభుత్వం అంగన్వాడీలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. వారి వేతనం రూ.10 వేలు దాటడంతో వారిని అన్నిరకాల సంక్షేమ పథకాలకు దూరం చేసింది. కేవలం వారికి ప్రస్తుతం ఇస్తున్న రూ.11,500లతోనే బతుకీడుస్తున్నారు. అంటే సంవత్సర మంతా పనిచేస్తే అంగన్వాడీ కుటుంబానికి రూ.1.38 లక్షల ఆదాయమే దక్కుతోంది. ప్రభుత్వ సేవలు అందిస్తున్న తమకు రూ.1.38 లక్షలు, వేరే పనిచేసుకుంటూ బతుకుతున్న లబ్ధిదారు కుటుంబానికీ రూ.1.40 లక్షలు ఇవ్వడాన్ని అంగన్వాడీలు పోల్చుకోవడాన్ని తప్పు పట్టాల్సింది లేదు.

ఎన్నికల ముందు ఉద్యోగులు, కార్మికులు సమ్మె నోటీసులు ఇస్తే వాటిని పరిష్కరించి, సమ్మెను నివారించే ప్రయత్నాలు చేయాల్సిన సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇలా అహంకారపూరితంగా వ్యవహరించడం ద్వారా తన రాజకీయ అపరిపక్వతను బయటపెట్టుకున్నారు. ఇదే సమయంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులూ నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. మరోవైపు మున్సిపల్ కార్మికులూ సమ్మెకు సమయాత్తమవుతున్నారు. ఉద్యోగులు, కార్మికులపై ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రాబోవు ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

అంగన్వాడీల సమ్మె రోజురోజుకూ ఉధృతమవుతున్న వైనాన్ని గమనించిన టిడిపి వారికి సంఘీభావం ప్రకటించడం మొదలు పెట్టింది. ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న ఒక సెక్షన్ ఉద్యోగులకు దగ్గరయ్యేందుకు తపన పడుతోంది. ప్రభుత్వ వ్యతిరేక మంటలో తానూ కొంత చలి కాచుకోవాలని భావిస్తోంది. అంగన్వాడీల దీక్షా శిబిరాలకు నాయకులు హాజరై మద్దతుగా మాట్లాడుతున్నారు. ఇదేఅదనుగా ప్రభుత్వంపై విమర్శల దాడికి దిగుతున్నారు. దీక్షా శిబిరాలకు హాజరు కావడానికే పరిమితమవుతున్న నాయకులు క్షేత్ర స్థాయిలో దిగడం లేదు. గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగుల గొడుతున్నా, ఉద్యోగులను అడ్డుకునే ప్రయత్నాలు చేసుంటే చాలాచోట్ల కేంద్రాలు తెరుకునేవి కావు. ఉమ్మడి రాష్ట్రంలో 2001లో చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి ప్రభుత్వం అంగన్వాడీలను గుర్రాలతో తొక్కించిన ఘటన బహుశా టిడిపి నాయకులను ఇంకా వెంటాడుతుందో ఏమో. అంగన్వాడీల ఆందోళనలో వారు పెద్దగా భాగస్వామ్యం కావడం లేదు. అంగన్వాడీల పోరాటానికి వామపక్షాలు ముఖ్యంగా సిపిఎం, కార్మిక సంఘాలైన సిఐటియు, ఇతర ప్రజాసంఘాలు తొలి నుంచీ అండగా నిలుస్తూ వారి వెన్నంటే ఉన్నాయి. ఈ నెల 26 నుంచి ప్రత్యక్ష పోరాటానికి సైతం సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వంతో పోరాడి గతంలో ఎన్నో విజయాలు సాధించిన అంగన్వాడీలు అదే పోరాట స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరముంది.

అగ్రి టూరిజం క్లబ్ ప్రారంభం

క్లబ్‌ను ప్రారంభిస్తున్న నారాయణరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టూరిజం క్లబ్ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించాలని డిటిఒ నడిమింటి నారాయణరావు అన్నారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా అగ్రి టూరిజం యువ టూరిజం క్లబ్‌ను ఎచ్చెర్ల మండలంలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్ బిఎస్‌సి అగ్రికల్చర్ విద్యార్థులతో శనివారం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ వి.శ్రావణి, ఆఫీస్ ఇన్‌ఛార్జి డాక్టర్ శివ, డాక్టర్ కెవిఎస్ఎల్ రాజురుషి పాల్గొన్నారు.

యువకుడు హత్య

ఉలిక్కిపడిన కేశవరాయునిపాలెం

ప్రజాశక్తి- లావేరు

అప్పటి వరకు కుటుంబ సభ్యులు, గ్రామంలో సరదాగా గడిపిన వ్యక్తి శవమై కనిపించాడు. గుర్తు తెలియని వ్యక్తులు పోలిరెడ్డి (28)ని హత్య చేసి తన కళ్లానికి సమీపంలో పడేశారు. ఈ ఘటన లావేరు మండలం కేశవరాయునిపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుజ్జి పోలిరెడ్డి, తన భార్య గౌరి గత కొన్నాళ్లుగా విశాఖపట్నంలోని ఓ పాత ఇనుప సామగ్రి దుకాణంలో పనిచేశారు. 20 రోజుల కిందట స్వగ్రామానికి భార్యాభర్తలు వచ్చారు. అప్పటి నుంచి గ్రామంలో వ్యవసాయం పనులు చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి భోజనం చేసి కళ్లానికి వెళ్లిన పోలిరెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో కొట్టిమిట్టాడుతున్న పోలిరెడ్డిని కల్లాం దగ్గర నిద్రిచేందుకు వెళ్తున్న తండ్రి ఎరకయ్య, తమ్ముడు శ్రీను చూశారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న కుమారుడిని చూసి తండ్రి గ్రామంలోకి వెళ్లి కుటంబ సభ్యులను తీసుకొచ్చారు. కొన ఊపిరితో ఉన్న పోలిరెడ్డిని ఇంటికి తీసుకువెళ్లగా మార్గంమధ్యలో పరిస్థితి మృతి చెందాడు. మృతిని ఒంటిపై గాయాలతో పాటు తల వెనుక భాగంలో బలమైన గాయం తగిలింది. దీంతో చేయి, కాళ్లు విరిగిపోయి ఉన్నాయి. తన భర్తను ఎవరో హత్య చేశారని గౌరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో డిఎస్‌పి వై.శృతి, ఎస్ఐ కోటేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని హత్య గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. శనివారం ఉదయం సిఐ ఆదాం, ఎస్ఐ, విఆర్ఒ హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు జగదీష్ ఢిల్లేశ్వరిలు ఉన్నారు. దీంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు.

ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో పోలిరెడ్డి మృతదేహం)

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
IA 834/2023 IA 835/2023 IA 836/2023 OS 54/2016

పిటిషనర్: **వవులపల్లి సుజాత**
రెస్పాండెంట్లు: **పప్పులు సత్యనారాయణ**
--వగైరాలు.

To,
R-13: చదువులు శ్రావణ్ కుమార్ S/o లేట్ విజయ్ కుమార్.
R-14: చదువుల సింధు, D/o లేట్ విజయ్ కుమార్. R13 & R14 వెంకటేశ్వర కాలనీ, పొందూరు గ్రామం, మండలం శ్రీకాకుళం జిల్లా.

పై నెంబర్ దావాలో 9వ ప్రతివాది కాలం చేసినందున సదరు 9వ ప్రతివాది వారసులుగా చేర్పించమని కోరుతూ...see -5 Abatement, L.R పై నెంబర్ గల పిటీషనర్లలో పై కోర్టు వారి ఆర్డర్ ప్రకారం పలు పర్యాయములు కోర్టు ద్వారాను రిజిస్టర్ పోస్టు ద్వారాను నోటీసులు పంపించి ఉన్నప్పటికీ అమలు జరుగునందున ఇందు ఏ విషయమై మీకు ఆక్షేపణలు ఉన్నాయెడల **తేదీ: 28-12- 2023 ఉదయం: 10:30 గంటలకు** స్వయంగా గాని వకీల్ ద్వారా గాని పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను లేనియెడల మీ పరోక్షమున తీర్మానించుదరు.

Y.SATYA SRINIVAS
Y.RAMESH
పిటిషన్ తరపు న్యాయవాదులు,
పొందూరు.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
IA 837/2023 IA 838/2023 IA 839/2023 OS 54/2016

పిటిషనర్: **వావిల పల్లి సుజాత**
రెస్పాండెంట్లు: **పప్పులు సత్యనారాయణ**
--వగైరాలు

To
R-15: గురుగుబల్లి సుజాత, D/o లేటు అప్పారావు,
R-17: గురుగుబల్లి రాజా కుమారి, D/o లేట్ అప్పారావు, R15&R17 సా॥ వెంకటేశ్వర కాలనీ, పొందూరు గ్రామం, మండలం, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబర్ దావాలో 3వ ప్రతివాది కాలం చేసినందునకు సదరు 3వ ప్రతివాది వారసులుగా చేర్పించమని కోరుచూ..See -5 Abatement, L.R పై నెంబర్ గల పిటీషనర్లలో పై కోర్టు వారి ఆర్డర్ ప్రకారం పలు పర్యాయములు తను కోర్టు ద్వారాను రిజిస్టర్ పోస్టు ద్వారాను నోటీసులు పంపించి ఉన్నప్పటికీ అమలు జరుగునందున ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల **తేదీ 28-12-2023ది. ఉదయం 10:30 గంటలకు** స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలయూను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించుదురు.

వై .సత్య శ్రీనివాస్
వై .రమేష్.
పిటిషనర్ తరపు న్యాయవాదులు,
పొందూరు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బెంతు ఒరియాల సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం బెంతు ఒరియాలతో ముఖాముఖీ చర్చలు నిర్వహించారు. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు లేకపోవడంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్నామన్నారు. చదువుకున్న అభ్యర్థులు పోటీ పరీక్షలకు హాజరు కాలేకపోతున్నట్లు జెసి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని జెసి తెలిపారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ భరత్‌కుమార్, తహశీల్దార్ మీనాదేవి, డిటిలు గురుప్రసాద్, శ్రీహరి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్ష అభియాన్‌లో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా అధ్యక్షులు పి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా భాగంగా జ్యోతిరావు పూలే పార్కు వద్ద చేపట్టిన సమ్మె శనివారానికి నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలు పరిష్కారించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. క్రమం తప్పకుండా ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో జెఎసి ప్రధాన కార్యదర్శి పి.తవిటినాయుడు, కోశాధికారి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బి.గిరిధర్, బి.నరసింగరావు, గౌరీశంకర్, బి.యుగంధర్, పోతయ్య, కె.రాము పాల్గొన్నారు.

పలాస : రక్షణ చట్టం లోగో ఆకారంలో ఉన్న విద్యార్థులు

వినియోగదారుల చట్టాలపై అవగాహన

పలాస: జాతీయ వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వినియోగదారుల సంఘం అధ్యక్షులు దువ్వాడ జనార్ధనరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ వినియోగదారుల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కామర్స్ డిజిటల్ వర్తకం శకంలో వినియోగదారు రక్షణ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు విద్యార్థులకు నిర్వహించి బహుమతులు అందజేశారు. వినియోగదారుల రక్షక చట్టం లోగో ఆకారంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి పాఠశాలలో ప్రతిజ్ఞ చేసి అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు, పాఠశాల వినియోగదారుల క్లబ్ ఇన్‌ఛార్జి కొయ్యల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరమని వినియోగదారుల కోర్టు జడ్జి ఆర్.చిరంజీవి పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రా ఆధ్వర్యాన ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి డి.వెంకటరమణ, వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఇందిరాప్రసాద్, దిశా ఎస్ఐ రేవతి, ఆశ్రా అధ్యక్షులు గంజి ఎజ్రా, లఖినాన రవికుమార్, కట్టా పార్థసారథి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతీఫెడరిక్, తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ రాజారమేష్, ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో మెరుగైన సేవలు

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖాధికారులంతా ప్రజా సేవకులని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అధికారీ కృషి చేయాలని శాశ్వత లోక్ అదాలత్ (ప్రజా ప్రయోజన సేవలు) చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అన్నారు. శాశ్వత లోక్ అదాలత్ ఆధ్వర్యాన కోర్టులో హై లెవెల్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవల్లో లోపం జరిగితే ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చున్నారు. ప్రధానంగా ప్రజలకు ప్రభుత్వం నుంచి అందిస్తున్న సౌకర్యాలను గృహ నిర్మాణ సంస్థ, రెవెన్యూ, ప్రజా రవాణా సంస్థ, నగర పాలక సంస్థ, తపాలా, బ్యాంకింగ్, ఉపాధిహామీ, నీటిసరఫరా, పారిశుధ్యం, విద్య, బీమా, వైద్య సేవలు, విద్యుత్, టెలిఫోన్, ప్రభుత్వ శాఖలు, రియల్ ఎస్టేట్ ఇతర ఆర్థిక సంస్థల సేవలు సమాజంలోని పౌరులకు పక్కాగా అందాలన్నారు. సంస్థల్లోని లోపాలు కారణంగానే కోర్టును ఆశ్రయి స్తారని, అటువంటివి పునరావృతం కారాదని అన్నారు. సమావే శంలో జిల్లా విద్యా శాఖ తరపున ఎస్.తిరుమలచైతన్య, ఎస్.నీరజ, అడిషనల్ డిఎంహెచ్ఒ అనురాధ, రెవెన్యూ శాఖ నుంచి ఎం.శ్రీకాంత్, పోస్టల్‌శాఖ నుంచి ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

ఇచ్ఛాపురం: స్థానిక జ్ఞానభారతి పాఠశాలలో కార్యదర్శి జోహార్‌ఖాన్ అధ్యక్షతన 37వ క్రీడా వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిఐ ఈశ్వర చంద్రప్రసాద్, సీనియర్ క్రీడాకారులు శివప్రసాద్, పల్లంటి మధుమూర్తి పాల్గొని క్రీడా పతాక జెండాను ఎగురవేశారు. విద్యార్థులందరూ పాల్గొని అనేక క్రీడల్లో వారివారి ప్రావీణ్యతలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇ.బి.పండా, హెడ్మిస్ట్రస్ రషీదాసుల్తాన్, ఎఒ ప్రేమ్ సర్తాజ్‌ఖాన్, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చక్కెర కర్మాగారం తెరిపించాలి

ఆమదాలవలస : గడచిన ఎన్నికల్లో వైసిపి ఇచ్చిన హామీ ప్రకారం చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జనసేన, టిడిపి ఆధ్వర్యంలో రైతులతో కలిసి చక్కెర కర్మాగారం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమైన చక్కెర పరిశ్రమగా పేరుగాంచిన సహకార చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ఎన్నికలయ్యాక ఆ హామీని మరిచిందని ఎద్దేవా చేశారు. చక్కెర కర్మాగారం తెరిపించేందుకు రైతుల పక్షాన నిలబడి జనసేన, టిడిపి పోరాడుతుందన్నారు. కర్మాగారాన్ని తెరిపించి యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మాజీ కౌన్సిలర్ ఇంజరాపు విశ్వనాథం, పైడి మురళీమోహన్, సతీష్ కుమార్, గంగు కోటేష్, రమణ పాల్గొన్నారు.

చక్కెర కర్మాగారం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

'ఆడుదాం ఆంధ్రా'పై అవగాహనా ర్యాలీ

పలాస : 2 కె మారథాన్ ప్రారంభించిన చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- **పలాస:** డివిజన్ పరిధిలో ఈనెల 26 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ భరత్ నాయక్, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తెలిపారు. శనివారం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పట్టణ ప్రజలకు ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కల్పించేందుకు 2 కె మారథాన్ కార్యక్రమాన్ని చైర్మన్ బల్ల గిరిబాబు ప్రారంభించారు. జూనియర్ కళాశాల నుంచి కాశీబుగ్గ మూడు రోడ్లు జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తు ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఒక ప్లాట్‌ఫాంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు, యువతీ, యువకులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్ర కుమార్, ఎఇ అవినాష్, పట్టణ, మండల ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, క్రీడా కారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఆడుదాం ఆంధ్రలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, ఆర్‌పిలు, వార్డు వాలంటీర్లు ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రంలో వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య, పట్టణ వైసిపి అధ్యక్షులు బలివాడ ప్రకాశరావు పట్నాయక్, కౌన్సిలర్లు బచ్చు జగన్, పిలక సంతోష్, పరపటి కోటి, నీలపు ఢిల్లీ, జెసిఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, కో-అప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తానా, ప్రత్తి అవినాష్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 3కె రన్

శ్రీకాకుళం అర్బన్: ఆడుదాం ఆంధ్రాకు సంఘీభావంగా నగరంలో ఆదివారం ఉదయం 6 గంటలకు 3కె రన్ నిర్వహిస్తున్నట్టు వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మెంటాడ స్వరూప్ తెలిపారు. ఈ మేరకు ఆడుదాం ఆంధ్రాటీ షర్ట్‌లను శనివారం విడుదల చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌లు పాల్గొంటారని చెప్పారు. నగరంలోని పొట్టిశ్రీరాములు జంక్షన్ నుంచి స్టేడియం వరకు 3కె రన్ ఉంటుందని తెలిపారు.

ఇచ్ఛాపురం : ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ఆమదాలవలస: ఆడుదాం ఆంధ్రా ప్రారంభోత్సవ సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆదివారం నియోజకవర్గస్థాయిలో 2కె రన్ జరుపనున్నట్లు కమిషనర్ ఎం.రవిసుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు పట్టణ శివారున వైఎస్‌ఆర్ విగ్రహ కూడలి నుంచి కృష్ణాపురం జంక్షన్ వరకు 2కె రన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రాలో నమోదు చేసుకున్న క్రీడాకారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి శాసనసభాపతి తమ్మినేని సీతారాం హాజరుకానున్నారని తెలిపారు.

నియామకపు పత్రం అందజేస్తున్న కృష్ణకుమారి

కారుణ్య నియామక పత్రం అందజేత

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని ఆమదాలవలస సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో వంట మనిషిగా పార్వతి విధులు నిర్వహిస్తూ 2017 అక్టోబరు 4న మృతి చెందింది. తర్వాత సామాజిక భద్రత కింద ఆమె కుమారుడు యుగంధర్‌కు కారుణ్య నియామకం ఇవ్వాలని కుటుంబ సభ్యులు దరఖాస్తు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఈనియామకాన్ని విస్మరించడంతో ఆ కుటుంబానికి కుటుంబ భద్రత కొరవడింది. దీంతో ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాంను సంప్రదించి న్యాయం చేయాలని కోరారు. వారి అభ్యర్థన మేరకు ఎన్‌జిఒ నాయకులు ఆ శాఖ ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్‌ను ఆశ్రయించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పందించి యుగంధర్‌కు టైపిస్టుగా ఉద్యోగ నియామకం చేపడుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకపత్రాన్ని జిల్లా ఎస్‌సి వెల్ఫేర్ అండ్ ఎంపవర్మెంట్ అధికారి కార్యాలయ పర్యవేక్షకులు ఎన్.కృష్ణకుమారి శనివారం అందజేశారు. ఎన్‌జిఒ సంఘం కోశాధికారి బడగల పూర్ణచంద్రావు, వైస్ ప్రెసిడెంట్ దుబ శశిభూషణరావు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు అభినందనలు

నందిగాం : మండలంలో లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చిలుకు కృష్ణారావును డివి కె.వెంకటేశ్వరరావు శనివారం అభినందించారు. జిల్లాసైన్స్ విభాగంలో, కళాఉత్సవ్ బాలరంగ్ పోటీల్లో కృష్ణారావు చూపిన ప్రతిభకు పురస్కారంగా అభినందించారు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల్లో నాయకత్వ లక్షణాలు ఉండాలని, అప్పుడే పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఉప విద్యాశాఖాధికారులు గార పగడాలమ్మ, విజయకుమారి, జిల్లాసైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి పాల్గొన్నారు.

ఓటరు నమోదు రికార్డులను అందజేయాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఓటరు నమోదులో సర్వే చేసిన వివరాలను సంబంధిత రిజిస్టర్‌లను త్వరితగతిన పూర్తిచేసి తహశీల్దార్ కార్యాలయానికి అందజేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి తహశీల్దార్లు, బిఎల్‌ఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బిఎల్‌ఒలు ఇంటింటికి వెళ్ళి ఓటరు నమోదు, తొలగింపు తదితర అంశాల నమోదు చేసిన రికార్డులను పూర్తి సమాచారంతో పూర్తిచేసి కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు జామి ఈశ్వరమ్మ, చలమయ్య, రెవెన్యూ సిబ్బంది, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిశీలించాలని జెడ్‌పి సిఇఒ ఆర్. వెంకట్రామన్ బిఎల్‌ఒలకు సూచించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమీక్షించారు. ఓటరు నమోదుకు సంబంధించి తగిన ధ్రువపత్రాలు పరిశీలించాలని బిఎల్‌ఒలకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజిని, డిటి శంకరరావు, ఆర్ఐ వైకుంఠరావు, బిఎల్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

రణస్థలం : అవగాహన కల్పిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం కావాలని లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పి.రవికుమార్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన రాగోలులోని వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో రైతుల విజేతగా గుర్తింపుపొందిన చౌదరి చరణ్ సింగ్ పుట్టిన రోజు సందర్భంగా జాతీయ రైతు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని అన్నారు. రైతే దేశానికి వెన్నుముఖంగా నిలుస్తున్నారు. నేటి యువత వ్యవసాయ రంగంలో నిలిచి దేశ అభివృద్ధి తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ పి.వి.సత్యనారాయణ, సీనియర్ సైంటిస్టు పి.అరుణజ్యోతి, మధుకుమార్, రైతులు శీర రమణయ్య, చిట్టి మోహనరావు, గేదెల శ్యామలరావు, రెడ్డి నారాయణరావు, శీర గోవిందరావు, చల్లా రమణ, చల్లా చిన్నారావు, తలగాన లక్ష్మణరావు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలో తాళ్లవలస గ్రామంలో శనివారం మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా "జాతీయ రైతు దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన రైతు, శ్రామికుల మధ్య మిత్ర అభ్యుదయ రైతు ఇజ్జు సత్యన్నారాయణ, బి.లక్ష్మి వరప్రసాద్, ఎం.చంద్రమౌళి, వాళ్ళే సూర్యనారాయణ రాము, ఇతర మహిళా రైతుల చేతులమీదగా కేక్‌కట్ చేసి వేడుక చేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ విజయనగరం ఏరియా మేనేజర్ బి. లక్ష్మీ నరసింహమూర్తి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వై.లహరి, ఆర్.కృష్ణ, రత్నాకర్, రైతులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

కవిటి : చిన్నారికి కేక్ తినిపిస్తున్న రాజేష్

క్రీస్తు శాంతి బోధనలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీస్తు శాంతి బోధనలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన క్రిస్మస్ హైటీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. తన బాల్యం క్రిస్టియన్ స్కూల్‌లోనే సాగిందని అన్నారు. అందువల్ల క్రైస్తవ బోధనలపై తనకు పూర్తి అవగహన ఉందన్నారు. ఎదుటివారిని ప్రేమించడం, నిశ్వార్థమైన ప్రేమ, కలిగి ఉండడం క్రీస్తు బోధనల్లో ప్రధానమైనవన్నారు. పాస్టర్ల ఫెలోషిప్ జిల్లా అధ్యక్షులు డియస్ వియస్ కుమార్ మాట్లాడుతూ క్రీస్తు బోధనల సారాంశాన్ని ప్రతిఒక్కరూ మనన చేసుకోవాలన్నారు. క్రైస్తవులకు శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని జాన్ జీవన్ కోరారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి కేండిల్స్‌ను వెలిగించారు. అలాగే జిల్లాలోని పాస్టర్లకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ జి.జయదేవి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి టి.చంద్రశేఖర్, డాక్టర్ కృపానందం, అలజంగి నవీన్‌కుమార్, ప్రేమ్ కుమార్, దానియేలు, జయరాజ్ పాల్గొన్నారు.

కవిటి: సర్వమత సమ్మేళనం మన సంస్కృతని జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ అన్నారు. కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందుమాధవి, బల్లెడ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి: సమాజంలో అన్ని కులాలు, మతాలు అందిస్తున్న బోధనలు ఒక్కటేనని, సర్వమత సామరస్యాన్ని విద్యార్థి దశనుంచే చాటాలని రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ అన్నారు. పాఠశాల ఆవరణలో క్రిస్మస్ వేడుకలను శనివారం విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే మనం అనుసరించే విధానాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలోని ఓక్లాండ్ పాఠశాల్లో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు సందడి చేశారు. మేరీమాత వేషధారణ, శాంతా క్లాస్, వేషధారణలతో విద్యార్థులు ఆలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధులత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి : వేడుకల్లో పాల్గొన్న రవీంద్రభారతి విద్యార్థులు

ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి- సోంపేట

పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని సోంపేట రోటరీక్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం రోటరీ ప్రతినిధులు, విద్యావేత్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నినాదాలు చేసారు. పోలియో నిర్మూలనకు రోటరీ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాల కోసం ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డుదారులకు వంద రోజుల పని

లావేరు: జాతీయ ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డుదారులకు వందరోజులు పని కల్పించాలని డ్వామా పీడీ చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఉపాధి కూలీకి 100 రోజులు పని కల్పించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి వికలాంగులకు పూర్తిస్థాయి పనులు కల్పించాలని, ఎన్ఎంఎం యాప్ ద్వారా ప్రతిరోజు హాజరు పంపించాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ కుప్పిలి సురేష్ కుమార్, ఎపిఒ సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు విధి నిర్వాహణలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎంపిడిఒ ఫణీంద్రకుమార్ అన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులకు, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ పనులు ప్రారంభించి ప్రతి కుటుంబానికి ఈ ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సంబంధిత రికార్డుల నవీకరణ, జాబ్‌కార్డులు నవీకరణ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పండ్లతోటలు పెంచేందుకు ఆసక్తికరంగా ఉండే రైతులను గుర్తించి మునగ, మామిడి, జీడి, కొబ్బరి పంటలను వేసేందుకు వారికి అవగాహన కల్పించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ అరుణ్ కుమార్, క్లస్టర్ జెఇ హరిప్రసాద్, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

గ్రామకంఠం స్వాధీనం

రణస్థలం: మండల కేంద్రంలో జెఆర్ పురం పంచాయతీ పాత పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో ప్రస్తుతం ఎంపియుపి స్కూల్, ముందుభాగం రావాడ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 2/1లో 18 సెంట్లు గ్రామకంఠం భూమిని తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, పంచాయతీ సెక్రటరీ ఆదినారాయణ, ఎస్ఐ జి.రాజేష్ సమక్షంలో శనివారం స్వాధీనం చేసుకుని సిమెంటు స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వ భూమిని గతంలో టిడిపి నాయకుడు, రణస్థలం మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు ఆక్రమించుకొని భూమిని కొన్ని ఏళ్లు అనుభవించాడు. అయితే సదరు భూమి నాదేనని వైసిపికి చెందిన మాజీ సర్పంచ్ పిన్నింటి అప్పలనరసయ్య కుమారులు లక్ష్మునాయుడు, సత్యంనాయుడు విజయనగరం మహరాజుల దగ్గర భూమి కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ కాగితాలు చూపించి ఆగస్టు 21న ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో వైసిపి నాయకులు, ఆక్రమించిన టిడిపి నాయకులు కోర్టుకు వెళ్లారు. ఈ స్థలంపై టిడిపి నాయకులకు ఎటువంటి హక్కు లేదని కోర్టు నిర్ధారించింది. ఈ సందర్భంలో ఆ భూమి ప్రభుత్వానిదేనని, గ్రామకంఠంగా రెవెన్యూ రికార్డుల్లో ఉందని రెవెన్యూ అధికారులు కోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ రికార్డు ప్రకారం ఉన్న 18 సెంట్లు భూమి గ్రామకంఠంగా ఉందని అధికారులు కోర్టుకు తెలిపారు. సదరు ఇద్దరి ఫిర్యాదును పరిశీలించిన కోర్టు కేసు పెండింగ్లో ఉంచింది. హైకోర్టులో వివాదం ఉన్నా వైసిపికి చెందిన నాయకులు సుమారు 18 సెంట్లు గల గ్రామ కంఠం భూమి ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ భూమి వివాదం కోర్టులో ఉన్నందున జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈఫెన్సింగ్‌ను ఎవరైనా తొలగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు

మాట్లాడుతున్న డిఎస్‌పి శృతి

పోలీస్ స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి- ఆమదాలవలస

సకాలంలో ఫిర్యాదులను పరిష్కరించాలని డిఎస్‌పి వై.శృతి అన్నారు. శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్‌స్టేషను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో మర్యాదపూర్వకంగా మెలగాలని, సకాలంలో ఫిర్యాదులను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. పైడయ్య, ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎపివైఎస్ఎస్ కార్యదర్శిగా సూర్యారావు

ప్రజాశక్తి- పొందూరు

సూర్యారావు

ఎపి ఎరుకుల సేవా సంఘం ఉత్తరాంధ్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా మండలం ఎరుకుల కాలనీకి చెందిన గొర్లె సూర్యారావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఉత్తరాంధ్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర కమిటీ ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎరుకుల జాతి అభివృద్ధికి, ఐక్యతకు పాటు పడతానని, ఎరుకుల జాతి బిడ్డలకు ఏ సమస్య వచ్చినా పరిష్కారదిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు మండలంలో పలువురు అభినందనలు తెలిపారు.

కమిటీ సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యూత్ క్లబ్ బెజ్జిపురం ఆధ్వర్యాన ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో నిర్వహిస్తున్న స్కూల్ రెడీనెస్ అండ్ బాలవికాస్ ప్రోగ్రాంలో భాగస్వాములు కావాలని వైసిపి డైరెక్టర్ ఎం.ప్రసాదరావు కోరారు. నగరంలోని వైసిబి కేంద్ర కార్యాలయంలో గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల మండలాల పాఠశాలల నిర్వహణ కమిటీ చైర్మన్లు, సభ్యులకు శనివారం శిక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్య - పాఠశాల నిర్వహణ కమిటీకి సహకరించాలన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారి అవసరానికి అనుగుణంగా సదుపాయాలు కల్పించాలన్నారు. పిల్లల ఆరోగ్యం, వారికి ఆటపాటలతో బోధన సాగించాలన్నారు. ప్రాజెక్టు లెర్నింగ్ కో-ఆర్డినేటర్ టి.కరుణాకరరావు మాట్లాడుతూ పాఠశాలను సమాజాన్ని ఉపయోగించుకొని అభివృద్ధి చేసుకోవాలన్నారు. పిల్లలకు మంచి పౌష్టికాహారంతో కూడిన విద్యా బోధనలను, ఆరోగ్యం, వ్యాధికారక నిరోధక టీకాలను అందించాలన్నారు. కార్యక్రమంలో వైసిబి కమ్యూనిటీ ఆర్గనైజర్స్ వై.శంకరరావు, ఆర్.కల్పన, పి. ఉమామహేశ్వరరావు, జి.హేమసుందర్, యు.మెహెర్‌వాణి, బి.సంతోషి పాల్గొన్నారు.

ఎస్ఐగా తాపీమేస్త్రీ కొడుకు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వరహాలనాయుడు

పురపాలక సంఘంలో 1 వార్డు పరిధిలో జగ్గుశాస్త్రుల పేటకు చెందిన హనుమంతు వరహాల నాయుడు సివిల్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు హనుమంతు రామారావు, రమణమ్మ. తండ్రి తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నారు. వరహాలనాయుడు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇంటర్మీడియట్ శ్రీ చైతన్య కళాశాలలో, బీటెక్ ఆంధ్రా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఐ ఫలితాల్లో 400 మార్కులకుగాను 247 మార్కులు సాధించి బిసి ఎ కేటగిరీలో ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. ఎస్ఐ పోస్టు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామపెద్దలు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు చేయూత

టెక్కలి: మండలంలోని తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బిగ్‌హెల్ప్ సంస్థ శనివారం చేయూతనందించింది. పాఠశాలలో వివిధ తరగతులు చదువుతున్న పేద విద్యార్ధులకు ఆవసరమైన దుస్తులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎ.ధర్మారావు చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో బిగ్‌హెల్ప్ సంస్థ డైరెక్టర్ రామముని రమేష్‌కుమార్, చైర్మన్ ఎన్.కృష్ణారావు, ఉపాధ్యాయులు బోడ్డేపల్లి విద్యావతి, బి.లత, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులకు బిల్లుల చెల్లింపు ఎప్పుడు?

మెళియాపుట్టి: తాగునీటి పనులు చేసి సంవత్సరాలు దాటినా ఇంతవరకు బిల్లులు చెల్లించడం లేదని ఎంపిటిసి ప్రతినిధి జయమునిరావ్ అధికారులకు ప్రశ్నించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం భరణికోట ఎంపిటిసి సవర రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గొప్పిలిలో జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం ఎప్పుడు కల్పిస్తారని సర్పంచ్ ప్రతినిధి పల్లి యోగి ప్రశ్నించారు. పెంగువాడలో విద్యుత్ వైర్లు సరి చేయాలని, విద్యుత్ స్తంభాలు వేయాలని ఆంపురం సర్పంచ్ జమ్మయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం బస్తా 80 కేజీలు బదులు 83 కేజీలు తూకం వేస్తున్నారని దీనివలన రైతులకు నష్టం వస్తుందని సభ్యులు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దాసుపురం నిర్వాసిత గ్రామంలో నిలిచిన పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వరరావు కోరారు. సమావేశంలో మండల బడ్జెట్‌ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ట్రైకార్ డైరెక్టర్ ప్రతినిధి ఎస్.సుభాష్, ఎంపిడిఒ కార్యాలయ ఇఒ తిరుపతి పట్నాయక్, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, పద్మనాభరావు, ఎఒ దానకర్ణుడు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రకుమారి